కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్‌ భవానీనగర్‌ రెసిడెన్షియల్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పార్టీలకు అతీతంగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా మూసీ అభివృద్ధికి తాము అండగా ఉంటామని, అభివృద్ధి పేరుతో పేద ప్రజల ఇళ్లు కూలగొడతామంటే ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ రంగా నర్సింహగుప్తా, కాలనీ అధ్యక్షుడు జి.లక్ష్మినారాయణ, కార్యదర్శి తిరుపతిస్వామి, అదనపు కార్యదర్శి గిరిధర్‌, కోశాధికారి అశోక్‌, ఉపాధ్యక్షులు ప్రకాష్‌ తులసి కృష్ణ గౌడ్‌, తిరుపతి స్వామి, శ్రీనివాసచారి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు


సమీక్ష సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్‌ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్‌: డివిజన్‌ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. పారిశుద్ధ్యంపై సోమవారం హయత్‌నగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో కార్పొరేటర్‌ మాట్లాడారు. ప్రతిరోజు కాలనీల్లో రోడ్లను శుభ్రం చేయడంతో పాటు చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. సక్రమంగా విధులు నిర్వహించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఈ దామోదర్‌రావు, శానిటేషన్‌ డీఈ నీలిమ, రాంకీ సిబ్బంది వేణుకుమార్‌, యాదగిరి, మేధ, అజీమ్‌ ఉద్దీన్‌, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శరత్‌కుమార్‌, కామేష్‌, పవన్‌రెడ్డి, కిషోర్‌, సురేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

లారీలోంచి సామగ్రి దించుతుండగా తాడుతెగి వ్యక్తి మృతి

న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యుల ఆందోళన




పుట్ట కొమరయ్య (ఫైల్‌)

మన్సూరాబాద్‌/హస్తినాపురం: ట్రాన్స్‌పోర్ట్‌ లారీలో నుంచి సామగ్రి దించే క్రమంలో ఓ హమాలీ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చేటు చేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ఖానాపురం గ్రామానికి చెందిన పుట్ట కొమరయ్య (58) గత కొన్నేళ్లుగా మన్సూరాబాద్‌ వీకర్‌సెక్షన్‌కాలనీలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. గత 15 ఏళ్లుగా ఆటోనగర్‌లోని దీపక్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఏజెన్సీలో హమాలీగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం యథావిధిగా ట్రాన్స్‌పోర్ట్‌ లారీలో వచ్చిన పార్శిళ్లను కిందికి దించే క్రమంలో తాడు తెగిపోయి పక్కను ఉన్న మరో లారీకి కొమరయ్య తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. రెక్కాడితే గానీ.. డొక్కాడని పేద కుటుంబానికి చెందిన కొమరయ్య మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, బస్తీవాసులు డిమాండ్‌ చేస్తూ ఘటన స్థలం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మృతుడి బంధువులు మాట్లాడుతూ.. దీపక్‌ ట్రాన్స్‌ఫోర్ట్‌ ఏజెన్సీ యాజమాన్యం నిర్లక్ష్యంతో కొమరయ్య మృతి చెందాడని ఆరోపించారు. మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్‌ కొప్పుల విఠల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల కుటుంబానికి మద్దతు పలికారు.

హత్యలకు పాల్పడే వారిపై శిక్షలు కఠినంగా ఉండాలి


సమావేశంలో పాల్గొన్న మహిళా మండలి ప్రతినిధులు

వనస్థలిపురం: అత్యాచారాలు, హత్యలకు పాల్పడే వారిపై శిక్షలు కఠినంగా ఉండాలని పోర్న్‌ సైట్స్‌, మాదకద్రవ్యాలను పూర్తిగా నిషేధించాలని, నేర చరితులను ఎన్నికల్లో తిరస్కరించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ అన్నారు. పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని మహిళా మండలి భవనంలో నిర్వహించిన 'మహిళలపై హింసకు అంతం ఎప్పుడు' అనే అంశంపై చర్చా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఢిల్లీలో పారా మెడికల్‌ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిపి హత్య చేసిన తర్వాత ప్రజల ఆందోళనలతో వర్మ కమిషన్‌ వేయడం, అనంతరం నిర్భయ చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. కానీ మహిళలపై పాశవికంగా అత్యాచారాలు, హత్యల పరంపర కొనసాగుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు, న్యాయవ్యవస్థలు సక్రమంగా నడిచేటట్టు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఝాన్సీ, ప్రేమలత, వాణి, అరుణకుమారి, విమల, ఎం.వాణి, అడ్వకేట్‌ రజిని పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్లా.. వ్యాపార కేంద్రాలా?



సామాజిక భవనం వద్ద కార్ల విక్రయాలు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌ పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రజావసరాల కోసం నిర్మించిన సామాజిక భవనాలు దుర్వినియోగమవుతున్నాయి. రూ. లక్షల్లో ప్రజాధనంతో నిర్మించిన ఈ సామాజిక భవనాలలో వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రజల అవసరాలకు కాకుండా విందులు, వినోదాలకు నిలయాలుగా మారుతున్నా వాటిపై దృష్టి సారించే వారు కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి భవనాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో ఇష్టం వచ్చినట్లు అద్దెలకిస్తూ జేబులు నింపకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంద్రప్రస్థకాలనీ ఫేజ్‌–2 కాలనీ కమ్యూనిటీహాల్లో ఆదివారం టెంట్లు వేసి కార్ల విక్రయాలు జరగడం చూసి స్థానికులు విస్మయానికి గురయ్యారు. ప్రజల అవసరాల కోసం నిర్మించిన ఈ కమ్యూనిటీ హాళ్లను ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు చేసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక, కిందిస్థాయి సిబ్బంది గేటుకు తాళం వేయడం లేదు. ఇదే అదునుగా కొందరు ప్రైవేటు వ్యక్తులు ఈ ప్రాంతంలో తిష్ట వేసి వ్యాపారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కమ్యూనిటీ హాళ్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆఖరి మజిలీకి అష్టకష్టాలు!

- క్రైస్తవులకు సమాధికి స్థలం సరిపోక అవస్థలు
- ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని వేడుకోలు


క్రైస్తవుల సమాధుల తోట

మలక్‌పేట: జీవితయాత్రలో చివరి మజిలీ మరణం సంభవించినప్పుడు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం సహజమైన తంతు. ప్రత్యేకించి నగరంలోని క్రైస్తవ సమాజం సమాధుల తోట (శ్మశాన వాటికలు) లేక అష్టకష్టాలు పడుతున్నారు. ఎవరైన చనిపోతే ఎక్కడ ఖననం చేయాలో అనే ఆందోళన మొదలవుతోంది. నగరంలో క్రైస్తవుల బరియల్‌ గ్రౌండ్స్‌ సమాధులతో పూర్తిగా నిండిపోయాయి. ఇంట్లో కుటుంబ సభ్యులు చనిపోయారనే బాధ కన్నా.. వారిని సమాధి చేసే అంశమే వారిని ఎక్కువగా మనోవేదనకు గురిచేస్తోంది. సమాధుల కోసం స్థలం కేటాయించాలని క్రైస్తవులు, క్రైస్తవ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అన్ని ప్రాంతాల్లో ఇదే దుస్థితి..

ఈస్ట్‌ హైదరాబాద్‌ క్రైస్తవుల అంత్యక్రియల కోసం ఆయా చర్చిలకు సంబంధించిన బరియల్‌ గ్రౌండ్స్‌లో స్థలం వెతుకులాడాల్సిన పరిస్థితి నెలకొంది. సమాధి స్థలం దొరికే వరకు రెండు మూడు రోజులు వేచి చూడాల్సి వస్తుంది. ఎక్కడ స్థలం దొరికితే అక్కడ ఎంత దూరమైనా సరే అక్కడే సమాధి చేసుకోవాల్సి వస్తుందని క్రైస్తవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట, చాదర్‌ఘాట్‌, దిల్‌సుఖ్‌నగర్‌, సైదాబాద్‌, సంతోష్‌నగర్‌, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన క్రైస్తవులను వేధిస్తున్న తీవ్రమైన సమస్య ఇది.

స్థలం కోసం వెతుకులాట..

నారాయణగూడలోని బరియల్‌ గ్రౌండ్స్‌లో క్రైస్తవులు సమాధి చేసేవారు. అయితే దశాబ్దాల కాలం గడిచిపోవడంతో అక్కడ సమాధులతో నిండిపోయింది. సమాధులను సైతం తవ్వి సమాధులు చేసే పరిస్థితులు దాపురించాయి. దీంతో సమాధులకు స్థలం కరువై కష్టాలు పడుతున్నారు. ఒకరికి పెట్టిన స్థలంలోనే తవ్వి మరొకరిని సమాధి చేయాల్సి వస్తోంది. ఈ విషయమై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశాన వాటిన సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని క్రైస్తవులు కోరుతున్నారు.

ఫతుల్లాగూడ బరియల్‌ గ్రౌండ్స్‌కు రానివట్లేదు..



గత ప్రభుత్వం ఈస్ట్‌ హైదరాబాద్‌ క్రైస్తవులకు ఎల్‌బీనగర్‌ ఫతుల్లాగూడలో 2ఎకరాల స్థలంలో బరియల్‌ గ్రౌండ్‌ ఏర్పాటు చేసింది. అయితే అక్కడ కేవలం ఎల్‌బీనగర్‌కు చెందిన క్రైస్తవులను మాత్రమే రానిస్తున్నారు. ఈస్ట్‌ హైదరాబాద్‌లో సమాధుల స్థలం లేదు. క్రైస్తవులు చనిపోయారంటే సమాధి ఎక్కడ చేయాలనే ఆందోళన మొదలవుతుంది. ఇటీవల సీనియర్‌ పాస్టర్‌ సతీమణి మరణిస్తే సమాధి స్థలం కోసం నానా అవస్థలు పడ్డాం. ఫతుల్లాగూడలో అడిగితే వద్దన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఫతుల్లాగూడలో ఖననం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

–జి.సాల్మన్‌రాజ్‌, ఈస్ట్‌ హైదరాబాద్‌ క్రిస్టియన్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 15, వంకాయ రూ. 25, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 25, కాకర రూ. 38, బీర రూ. 60, క్యాబేజి రూ. 18, ఫ్రెంచిబీన్స్‌ రూ. 55, క్యారట్‌ రూ. 35, దొండ రూ. 40–45, చిక్కుడు రూ. 48, గోకర రూ. 28, బీట్‌రూట్‌ రూ. 33, క్యాప్సికం రూ. 80, ఆలు రూ. 28, దోస రూ. 18, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 44, చామగడ్డ రూ. 37. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

చాదర్‌ఘాట్‌: ప్రజావాణి కార్యక్రమంలో ఓల్డ్‌మలక్‌పేట నుంచి అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు వచ్చిందని మలక్‌పేట సర్కిల్‌–6 డీసీ జయంత్‌ తెలిపారు. సంబంధిత ఫిర్యాదును టౌన్‌ ప్లానింగ్‌ డిపార్ట్‌మెంట్‌కు సిఫార్సు చేశామని అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నియామకం


దూరయ్య

వనస్థలిపురం: వాసవి క్లబ్స్‌ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌గా 2025కు వనస్థలిపురంకు చెందిన విట్టా దూరయ్య నియమితులయ్యారు. తమిళనాడులోని మధురై తుంకుమ్‌ కన్వెన్షన్‌ సెంటర్‌లో జరిగిన వాసవి క్లబ్‌ ఐకాన్‌ కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. రాబోయే కాలంలో వాసవి క్లబ్స్‌ సేవలను విస్తృతం చేస్తామని ఈ సందర్భంగా దూరయ్య వెల్లడించారు.

పరామర్శ

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ మార్గదర్శి కాలనీకి చెందిన కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు గంగారెడ్డి సతీమణి సత్యమ్మ ఇటీవల మరణించారు. సమాచారం తెలిసిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం గంగారెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అరవింద్‌శర్మ, నగేష్‌, శేఖర్‌, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌, జగన్మోహన్‌ రెడ్డి, జాహిద్‌, శ్యామ్‌గుప్తా పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం


సురేఖ

హస్తినాపురం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తుర్కయంజాల్‌ మున్సిపాలిటీ మునుగనూర్‌ గ్రామ పరిధిలోని మల్లికార్జున్‌నగర్‌ కాలనీకి చెందిన సురేఖ (24) ఈ నెల 14 ఇంట్లో నుంచి బయటికి వెళ్లి రాలేదు. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్త పాండురంగ జగ్దాడే శంకర్‌కు సురేఖ కనిపించలేదు. తన ఇద్దరు చిన్నపిల్లలు మాత్రమే ఉన్నారు. ఆందోళనకు గురైన భర్త తెలిసిన వారితో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో మైనర్‌..

హస్తినాపురం: తల్లి ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో ఉన్న మైనర్‌ బాలిక అదృశ్యమైంది. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పసుమాముల గ్రామ పరిధిలోని కళానగర్‌కు చెందిన లక్ష్మి ఆరోగ్యం బాగలేకపోవడంతో ఈ నెల 14న తన కూతురు (16)ను ఇంట్లోనే ఉంచి ఆస్పత్రికి వెళ్లింది. ఇంటికొచ్చే సరికి కూతురు కన్పించలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ ఇంటి పక్కనున్న తొండల నర్సింహా అనే యువకుడు తన కూతురికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లి ఉంటాడని లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది.

బడుగుల సంక్షేమమే ధ్యేయం

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌

మహేశ్వరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్‌ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా, కొత్త తండాలకు చెందిన బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు కేతావత్‌ రాజునాయక్‌తో పాటు అతని అనుచరులు కాంగ్రెస్‌ పార్టీ మండల మాజీ ఎస్టీ సెల్‌ అధ్యక్షుడు నేనావత్‌ రాజునాయక్‌ ఆధ్వర్యంలో కేఎల్‌ఆర్‌ సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ పార్టీ నెరవేరుస్తుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మెజార్టీ సర్పంచ్‌ స్థానాలను కాంగ్రెస్‌ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో కేతావత్‌ రవినాయక్‌, మోహన్‌నాయక్‌, రవినాయక్‌ ఎం. రాజునాయక్‌ తదితరులు ఉన్నారు. నేనావత్‌ రాజునాయక్‌, నేనావత్‌ రాజ్‌కుమార్‌నాయక్‌, శ్రీనివాస్‌నాయక్‌, రవినాయక్‌ పలువురు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం


బాలకృష్ణకు నగదు అందజేస్తున్న రామారావు

వనస్థలిపురం: పనిచేస్తే గానీ కడుపు నిండని కార్మికులు ప్రమాదాల బారిన పడితే వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ నేలపాటి రామారావు అన్నారు. వనస్థలిపురం పెయింటర్స్‌ అసోసియేషన్‌ సభ్యుడు ముత్తాల బాలకృష్ణ ప్రమాదవశాత్తు కాలికి గాయమై పనిచేయలేని స్థితిలో ఉండడంతో విషయం తెలుసుకున్న రామారావు ఆయనకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌గౌడ్‌, నరసింహాయాదవ్‌, సదాశివుడు పాల్గొన్నారు.

సత్కారం


అనిల్‌ థామస్‌ను సత్కరిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్‌: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలో హోసన్నా చర్చిలో నిర్వహిస్తున్న సెమీ క్రిస్మస్‌ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఏఐసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్‌ వైస్‌ చైర్మన్‌ అనిల్‌ థామస్‌ సోమవారం మన్సూరాబాద్‌ సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా జక్కిడి అనిల్‌ థామస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి కీర్తనలు, సినీ గీతాల పోటీలు

నాగోలు: కొత్తపేట డివిజన్‌ న్యూనాగోలు కాలనీలో కొమర్రాజు ఫౌండేషన్‌ స్వచ్ఛంద సేవా సంస్థ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి 19 వరకు అన్నమయ్య కీర్తనలు, తెలుగు కవితలు, భగవద్గీత, సినీ గీతాలు, లలిత సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొమర్రాజు జ్ఞానకుమార్‌, డాక్టర్‌ శ్యామల ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోటీలు ఉంటాయని మరిన్ని వివరాలకు 8247569708 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పహాడీషరీఫ్‌: గడిచిన ఐదేళ్ల కాలంలో శ్రీరాం కాలనీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని జల్‌పల్లి మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్‌ పల్లపు శంకర్‌ అన్నారు. రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు వేయించామన్నారు. మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్యం, ఇతర మెయింటెనెన్స్‌ పనులు ఎప్పటికప్పుడూ చేయాలని సూచించారు.